క్లుప్తంగా

రైతులకు కంది విత్తనాలు పంపిణీ



ఊట్కూరు: మండలంలోని చొన్నపోర్ల రైతు వేదిక భవనంలో బుధవారం ఏఓ మునీరా బేగం రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా చిన్నపొర్ల, ఎడివెల్లి గ్రామానికి చెందిన 50 మంది రైతులకు 4 కిలోల కంది విత్తనాల సంచులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, రైతులు సంజప్ప, వెంకటయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మాగనూర్: దేశ వ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. ఈ మేరకు ఐకేపీ, వీఓఏల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏపీఎంకు సమ్మె నోటీస్ అందజేశారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై 9న చేపట్టిన సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాబు, పావని, వరలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండయ్య జన్మదిన వేడుకలు

మక్తల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య జన్మదిన వేడుకలను బుధవారం మక్తల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆయన పేరు మీద ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ప్రభుత్వ అసుపత్రిల్లో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. అలాగే పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సోంశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, మండల మాజీ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మన్, అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా బీజేపీ కార్యదర్శి కల్లూరి నాగప్ప, ఈసరి నాగప్ప, అంజి, సత్యనారాయణ పాల్గొన్నారు.

4న కాంగ్రెస్ సమ్మేళనం



మక్తల్: ఈనెల 4న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్యనాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారన్నారు. జైబాబు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంటరీ కో ఆర్డినేటర్ పృథ్వీరాజ్ , పట్టణ అధ్యక్షుడు రవికుమార్, వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



ఊట్కూరు: మండలంలోని ఎడివెల్లి గ్రామానికి చెందిన శాసనోల సుజాత (32) అనే వివాహిత అదృశ్యం కావడంతో భర్త ఆంజనేయులు ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 30న పొలం పనికి వెళ్లిన సుజాత తిరిగి రాలేదు. దీంతో భర్త పొలం వద్దకు వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. బంధువుల ఇళ్లలో కూడా వెతకగా ఆచూకీ లభించకపోవడంతో చివరికి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధ్యతాయుత సేవలతోనే గుర్తింపు

మరికల్: బాధ్యతాయుత సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. మరికల్ మండల కేంద్రంలో ఎంఈఓగా విధులు నిర్వహించిన మనోరంజని బుధవారం ఉద్యోగ విరమణ చేయగా తోటి సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా కృషి చేశారని ఆమె సేవలను కొనియాడారు.

ఇళ్ల మధ్యనే కంపు కంపు!

- ఎక్కడి చెత్త అక్కడే..
- పొంచి ఉన్న దోమల బెడద
- చెత్త సేకరణకు 2 ట్రాక్టర్లు, 8 ఆటోలు, జేసీబీ కొనుగోలు
- అయినా మురుగుమయంగా కాలనీలు
- నివాస గృహాలు 6159
- సీసీ డ్రెయినేజీలు 18 కి.మీ.



మారుతి నగర్‌లో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు



కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం



అపరిశుభ్రంగా తయారైన వాటర్ ట్యాంకు

మక్తల్: మక్తల్ మున్సిపాలిటీలో దాదాపు ప్రభుత్వ ఉద్యోగులు 14 మంది ఉండగా, 41 మంది కార్మికులు పని చేస్తున్నారు. మున్సిపాలిటీలో 16వార్డులు, జనాభా 22,165 మంది ఉన్నారు. వారిలో పురుషులు 11,142 మంది, స్త్రీలు 11,023 మంది ఉన్నారు. మక్తల్ మున్సిపాలిటీలోని వార్డుల్లో 'సాక్షి' విజిట్ చేయగా అస్తవ్యస్తమైన పరిస్థితి కనిపించింది. ప్రజలకు ప్రతిరోజు ఇబ్బందులు పడే పరిస్థితి కనిపించింది. మక్తల్ మున్సిపాలిటీ వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వర్షం వస్తే యల్లమకుంటలో మురుగు చేరుతోంది. కేశవనగర్, వినాయకనగర్, అంబేద్కర్ నగర్, రహమానీయ కాలనీలలో డ్రెయినేజీలు నిండి రోడ్లపై పారుతున్నాయి. చాకలి గేరి వీధిలో ఇళ్ల మధ్య మురుగు చేరి కంపు కంపు కొడుతోంది. వార్డులకు నియమించిన అధికారులు జాడేలేదు. అందరు కార్యాలయానికి పరిమితమయ్యారు. ప్రత్యేక అధికారుల పనితీరు సక్రమంగా లేకపోవడంతో సమస్యలు అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మక్తల్ పట్టణంలో వీధిల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. తీసే వారులేక ప్రజలు ముక్కు మూసుకొని తిరగాల్సిన పరిస్థితి ఉంది. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినా అమలు చేయడం లేదు. మారుతినగర్‌లో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. మక్తల్ బస్టాండ్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు పక్కన మురుగు కాల్వలు శుభ్రం చేయక ఏళ్లు గడుస్తోంది. మక్తల్ మున్సిపాలిటీ మొదటి సారిగా ప్రకటించడంతో అధికారుల చర్యలు ఏమాత్రం కన్పించడంలేదు. ఇళ్ల మధ్య మురుగు నిలిచి దోమలు అధికం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..



మున్సిపాలిటీ పరిధిలో 8, 9వార్డులో మురికి గుంత ఏర్పడి 8 ఏళ్లు గడుస్తున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు. శబరి కాలనీ, బసవేశ్వర కాలనీలో సమస్యలు పరిష్కారం చేయడంలేదు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేదు. చెత్తాచెదారం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో సమస్యలు పరిష్కారం చేయాలి. – బాబు, శబరికాలనీ, మక్తల్

ప్రతిపాదనలు పంపించాం..



మక్తల్ మున్సిపాలిటీలో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, గుంతలు ఉన్నచోట మరమ్మత పనులు, కాలనీల్లో పాకింగ్ చేయడం వంటి వాటికి రూ.15 కోట్ల పనులకు ప్రతిపాదనలు సీఎండీ అధికారులకు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తాం. – శంకర్‌నాయక్, కమిషనర్

రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట: పట్టణంలోని 17, 22వ వార్డుల్లో నెలకొన్న డ్రెయినేజీ, అంతర్గత రోడ్ల సమస్యలను పరిష్కరించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు నామాజీ కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నందు నామాజీ మాట్లాడుతూ రెండు వార్డుల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని చిన్న పాటి వర్షానికే మురుగు రోడ్లపై పారుతుందని వివరించారు. అలాగే రోడ్లు గుంతల మయంగా మారడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. అలాగే యువకులు అతివేగంగా వాహనాలు నడుపుతున్నారని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అర్జున్ మిస్కిన్, చేతన్, నరేష్ పవార్ తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నందు నామాజీ, నాయకులు

జిల్లా స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో ప్రతిభ



కృష్ణా: మండల పరిధిలోని కున్సీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న మల్లికార్జున్ అనే విద్యార్థి జిల్లా స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన లాంగ్ జంప్, స్టాండింగ్ జంప్, రన్నింగ్ క్రీడల్లో మల్లికార్జున్ ప్రథమ స్థానంలో నిలిచి పతకం సాధించాడు. అలాగే మక్తల్ పట్టణంలో సోమవారం అంతర్జాతీయ ఖోఖో దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఓపెన్ ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన జట్టు ద్వితీయ స్థానంలో నిలువగా జట్టు సభ్యులను అభినందించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయండి

మద్దూరు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అలాగే ప్రైవేటు కార్పోరేట్ విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ మహేశ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి ఫీజుల నియంత్రణ చేయలేక చేతులెత్తేసిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వార్డులను విభజించండి

నారాయణపేట: నారాయణపేట మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వార్డులను విభజించాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి సలీం కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 5, 7, 8 వార్డులు విస్తీర్ణంలో అన్నిటికంటే పెద్దగా ఉన్నాయని, వీటిని విభజించి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అలాగే ఎన్నికల ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు.

పందులను ఊరికి దూరంగా తరలించాలి

మద్దూరు: పందులను ఊరికి దూరంగా తరలించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పందుల యజమానులకు సూచించారు. మద్దూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలో పందుల బెడద ఎక్కువ కావడంతో పందుల యజమానులను బుధవారం మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి పలు సూచనలు చేశారు. పందులతో డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, వాటిని పట్టణ కేంద్రానికి దూరంగా తీసుకెళ్లాలని సూచించారు. రెండు రోజులలోపు పట్టణంలోని పందులన్నింటినీ తరలించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సొంత డబ్బులతో బోరుకు మరమ్మతు

నారాయణపేట టౌన్: పట్టణంలోని మూడవ వార్డు శాంతి నగర్‌లో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు నిలిచిపోయింది. పైపుల మరమ్మతుతో అధికారులు నీటి సరఫరాను నిలిపేశారు. ఈ క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ కాకర్ల భీమయ్య వెంటనే స్పందించి వార్డులో నిరుపయోగంగా ఉన్న బోరును సొంత డబ్బులతో మరమ్మతు చేయించి ప్రజల దాహార్తిని తీర్చారు. భీమయ్య సేవలను గుర్తించిన తమిళనాడులోని ఓ యూనివర్సిటీ ఇటీవల ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించింది.



మరమ్మతు అనంతరం బోరు బావి నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ప్రమాదకరం.. కావాలి అప్రమత్తం

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలోని కోటవీధి ప్రాంతంలో గల ఊట బావి ప్రమాదకరంగా మారింది. వందల ఏళ్ల క్రితం నిర్మించిన బావి కావడం అలాగే వినియోగంలో లేకపోవడంతో ముళ్ల పొదలతో నిండిపోయింది. అలాగే బావి పక్కనే గ్రామంలోకి వెళ్లే ప్రధాన సీసీ రోడ్డు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు రోడ్డుగుండా వెళ్తుంటాయని రాత్రి వేళల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి బావి చుట్టూ గోడ నిర్మించాలని లేకపోతే బావిని పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.



పులిమామిడిలోని పురాతన బావి

బస్ సర్వీస్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

నర్వ: 'బస్సు సర్వీసును పునరుద్ధరించాలి' అనే శీర్షికన ఆదివారం సాక్షిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. మండలంలోని రాయికోడ్-ఆత్మకూర్ మధ్య బస్సు సర్వీసును బుధవారం ప్రారంభించారు. గతంలో ఆత్మకూర్ షటిల్ బస్సు పాథర్చేడ్, రాజుపల్లి మీదుగా రాయికోడ్‌కు వచ్చేది. అయితే అనివార్య కారణాలతో గత కొన్ని రోజులుగా ఈ బస్సు సర్వీసును ఆపేశారు. విద్యార్థులు చదువుకోవడానికి నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో విద్యార్థుల సమస్యలపై సాక్షిలో వార్తను ప్రచురించగా అధికారులు స్పందించి బస్సు సర్వీసును పునురుద్ధరించారు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు, ప్రజలు సాక్షి దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు.



ప్రారంభమైన రాయికోడ్- ఆత్మకూరు సర్వీసు

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మరికల్: మండలంలోని బుడ్డెగాని తండాలో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా మరికల్ ఎంపీడీఓ కొండన్న ఇళ్లకు మార్కింగ్ వేసి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేసుకోవాలని అప్పుడే బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబురావ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజునాయక్, జయరాంనాయక్, వెంక్యనాయక్, బాసునాయక్, హేమనాయక్, బుద్యనాయక్, బాబు, లక్ష్మణ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

బిల్లుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. మండలంలో మొత్తం 279 ఇళ్లు మంజూరు కాగా మండలంలోని గోకుల్ నగర్‌ను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి 58 ఇళ్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో గ్రామంలో ఏడుగురు లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఏడుగురు లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేయగా ఇద్దరికి మాత్రమే ప్రభుత్వం రూ.లక్ష బిల్లు మంజూరు చేసింది. అలాగే ఇతర గ్రామాల్లో బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు పూర్తి చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బిల్లుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు.



కొత్తపల్లిలో నిర్మాణంలో ఇందిరమ్మ ఇళ్లు

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయాలి

కోస్గి రూరల్: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాచారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంసిద్ధత కార్యాక్రమం అమలు తీరు , పాఠ్యాంశ బోధన విధానం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్ ప్రారంభ పరీక్ష పత్రాలను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యాక్రమంలో ప్రధానోపాధ్యాయులు బలరాం, ఉపాధ్యాయులు వీరమల్లేష్, సుష్మా , లక్ష్మి , రాధిక, హన్మంతు పాల్గొన్నారు.



విద్యార్థిని పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శంకర్‌నాయక్

పాఠశాలల్లో పచ్చదనం పెంపొందించాలి



ఉపాధ్యాయులకు మొక్కలు అందిస్తున్న ఎంఈఓ నిజాముద్దీన్

కృష్ణా: ఉపాధ్యాయులు పాఠశాలల్లో పచ్చదనాన్ని పెంపొందించాలని ఎంఈఓ నిజాముద్దీన్ సూచించారు. మండలంలోని హిందుపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్నా భోజనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నా భోజనం చేశారు. అలాగే మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2005–06లో పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఎంఈవో చేతుల మీదుగా పాఠశాలకు 20 రకాల పూల మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, షాహిన్, నాగరాజ్, రేణుక, రంగరావ్, గోపాల్ పాల్గొన్నారు.

గుర్జాల్ గ్రామస్తుల కల సాకారం

- రోడ్డు నిర్మాణానికి రూ.2.60 కోట్లు మంజూరు
- పనులు కూడా ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని గుర్జాల్ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏళ్లుగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఇక్కట్లను గుర్తించిన ప్రభుత్వం ఎట్టకేలకు గ్రామానికి బీటీ రోడ్డును వేసేందుకు ఇటీవల నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలో అధికారులు రోడ్డు లెవలింగ్‌కు కొలతలు కూడా చేపట్టారు. దీంతో ఇన్నేళ్లు బురద రోడ్డుతో ఇబ్బందులు పడిన తమ గ్రామానికి బీటీ రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపనుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుర్జాల్ గ్రామానికి వెళ్లే రోడ్డు

పీఆర్‌ఆర్ నుంచి నిధులు విడుదల

కృష్ణా రైల్వే బ్రిడ్జి నుంచి గుర్జాల్ గ్రామానికి 2 కిలోమీటర్ల రోడ్డు ఉంది. అయితే ఇది మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో బురదమయమైన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ద్విచక్రవాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.2.60 కోట్లు మంజూరు చేయడంతో అధికారులు పనులు కూడా ప్రారంభించారు.

ఏళ్ల నుంచి మట్టి రోడ్డే దిక్కు



దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి గుర్జాల్ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గుంతల రోడ్డుపై వెళ్తూ అనేక మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కూడా పోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామస్తుల మొరను ఆలకించిన ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసి, పనులు కూడా ప్రారంభించింది. దీంతో మా గ్రామానికి పండుగ వచ్చినట్లు ఉంది.
– రవి, గుర్జాల్ గ్రామం

ఆనందంగా ఉంది



కృష్ణా రైల్వే బ్రిడ్జి నుంచి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఈ ప్రాంతంలోని పొలాలు కలిగిన రైతులు, ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి. గతంలో వర్షం పడితే చాలు గ్రామానికి వెళ్లే రోడ్డు మొత్తం బురదమయంగా మారి రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బీటీ రోడ్డు వేస్తుండడంతో ఆనందంగా ఉంది. పనులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది.
–జంబన్న, కృష్ణా గ్రామం

త్వరితగతిన పనుల పూర్తి



గుర్జాల్ గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా గుత్తేదారును ఆదేశిస్తాం. ఇప్పటికే కాంట్రాక్టర్ లెవలింగ్ పనులు పూర్తి చేశారు. త్వరితగతిన మిగిత పనులు కూడా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తాం.
–మారుతి, ఏఈ పీఆర్, కృష్ణా మండలం